సాక్షి ప్రకాశం

మంగళవారం । 21 । మార్చి । 2023



అరణ్యంలో వెలుగు రేఖ

నల్లమల అభయారణ్యంలోని పాలుట్ల గిరిజన గూడెంలో సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో గిరిజనుల ఇక్కట్లు తీరాయి. - 8లో..



పోషకాహారంపై అవగాహన ముఖ్యం

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం ఎంతో ముఖ్యమని జేసీ అభిషిక్త్ కిషోర్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలు

ఒంగోలు: అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎకో క్లబ్ పాఠశాలల్లో నిర్వహించాలని ప్రకాశం జిల్లా గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ పోటీలు, పర్యావరణానికి సంబంధించిన ఒక నిముషం వీడియో, ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. మొదటి రెండు పోటీలకు చెందిన వర్కును గూగుల్ ఫామ్ లింక్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. వాటిలో మొదటి రెండు స్థానాలకు బహుమతులు ఉంటాయన్నారు. అదే విధంగా రాష్ట్రస్థాయి పోటీలకు కూడా ఎంపిక చేస్తారన్నారు. ఆన్‌లైన్ క్విజ్ ఈనెల 23న సాయంత్రం 7 నుంచి 7.30 గంటల వరకు 20 ప్రశ్నలతో క్విజ్ షేర్ చేస్తారన్నారు. వివరాలకు సెల్: 9492317117 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల కంటి అద్దాల కోసం టెండర్లు

ఒంగోలు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంధత్వ నివారణ సంఘం సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి అద్దాలు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వాళ్లు వెయ్యి రూపాయల డీడీ తీసుకుని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో టెండర్ ఫాం పొందవచ్చని పేర్కొన్నారు. 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు టెండర్ అప్లికేషన్స్ ఇస్తారని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

జాళ్లపాలెం తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

ఒంగోలు: జాళ్లపాలెం వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు-సంతనూతలపాడు-కొండపి మీదుగా జాళ్లపాలెం, ఒంగోలు-టంగుటూరు-జాళ్లపాలెంకు బస్సులు నడుపుతామన్నారు. ఈనెల 22వ తేదీ ఉదయం 6 గంటలకు ఒంగోలు డిపో నుంచి బస్సులు ప్రారంభమవుతాయన్నారు. అదే విధంగా ప్రతినెలా పౌర్ణమి ముందు రోజు తమ డిపో నుంచి అరుణాచలానికి బస్సు బయల్దేరి సాయంత్రానికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అయిపోయిన తరువాత రోజు ఉదయం 6 గంటలకు అరుణాచలంలో బయల్దేరి సాయంత్రానికి ఒంగోలుకు చేరుకునేలా బస్సులు నడుపుతున్నామన్నారు. ఒక్కొక్కరికి టికెట్ రూ.2 వేలు మాత్రమే అని ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

డీఈడీ పరీక్షలకు ఫీజు చెల్లించాలి

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సరం 2015-17, 2018-20 బ్యాచ్‌లలో మొదటి సంవత్సరం ఫెయిలైన అభ్యర్థులు ఏప్రిల్/మే నెలలో నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అన్ని సబ్జక్టులకు ఈనెల 24వ తేదీలోపు రూ.150 చెల్లించాలన్నారు. 3 సబ్జక్టులకు అయితే రూ.140, రెండు సబ్జక్టులకు రూ.120, ఒక సబ్జక్టుకు రూ.100 చెల్లించాలన్నారు. రూ.50ల అపరాధ రుసుముతో ఈనెలాఖరు వరకు చెల్లించవచ్చన్నారు.

ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



ఉగాది వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో ఉగాది ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని పోలీసు కళ్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉగాది వేడుకలు నిర్వహించాలన్నారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, అష్టావధానం వంటి తెలుగుదనం ఉట్టిపడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వేడుకల్లో పాల్గొనేలా ప్రజా ప్రతినిధులను, జిల్లాలోని కవులు, రచయితలు, ఇతర ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, దేవదాయ సహాయ సంచాలకులు మాధవి, డీఈఓ రమేష్, మెప్మా పీడీ రవికుమార్, పర్యాటక శాఖ అధికారి బెన్హర్, ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, పీఈఓ సామా సుబ్బారావు, ఓఎంసీ అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంటలు చేతికందివచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతులకు కడగండ్లుగా మారాయి. ఈదురుగాలులు, వడగళ్ల వానలకు పలు మండలాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంటల నష్టాన్ని సత్వరం అంచనా వేసి పరిహారానికి సంబంధించి నివేదికలను రూపొందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ సూచనల మేరకు జిల్లా యంత్రాంగం కదిలింది. పంటల నష్టాల అంచనాలు రూపొందిస్తోంది.

అకాల కష్టం



కనపర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడవకుండా పట్టలు కప్పి ఉన్న ధాన్యం

- వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలు
- నష్టాలు అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం
- 790 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్టు అంచనా
- కొన్నిచోట్ల కళ్లాల్లోనే తడిచిన ధాన్యం
- వారంలోపు నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అకాల వర్షాలు అన్నదాతను దెబ్బతీశాయి. అన్ని రకాల పంటలు చేతికొచ్చే సమయంలో రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నాలుగైదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షాలకు కొన్ని మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కష్టకాలంలో రైతులకు అండగా నిలవాలని, పంటల నష్టాన్ని సత్వరం అంచనా వేసి పరిహారానికి సంబంధించి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో అంచనాలు రూపొందించి ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో నివేదికలు కూడా ప్రచురించాలని చెప్పడంతో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులను కూడా అప్రమత్తం చేశారు.

790 హెక్టార్లలో పంటలకు నష్టం...

అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో అధికార యంత్రాంగం పర్యటించింది. జిల్లా మొత్తం మీద ఆరు మండలాల్లోని 13 గ్రామాల్లో పంటలు నష్టపోయినట్లు అంచనాలు రూపొందించారు. త్రిపురాంతకం మండలంలో 5 గ్రామాలు, పుల్లలచెరువు మండలంలోని 2 గ్రామాలు, సింగరాయకొండ మండలంలోని కలికవాయ గ్రామం, పామూరు మండలంలోని రెండు గ్రామాలు, చీమకుర్తి మండలంలోని రెండు గ్రామాలు, నాగులుప్పలపాడు మండలంలోని కనపర్తి గ్రామంలో పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. ఇప్పటి వరకు ఎనిమిది రకాల పంటలు నష్టపోయినట్లు అంచనాలు సిద్ధం చేశారు. ఎక్కువగా వరికి నష్టం వాటిల్లింది.

రాసులపై ఉన్న ధాన్యం కూడా...

ధాన్యం కోతలు పూర్తయి కళ్లాల్లో కొన్ని చోట్ల, కొనుగోలు కేంద్రాల వద్ద మరికొన్ని చోట్ల వర్షాలకు తడిసింది. ధాన్యంలో తడి శాతం అధికంగా ఉండటంతో వాటిని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టారు. ఆరబెట్టిన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు తడి శాతం వస్తేనే కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడు మండలం కనపర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షానికి తడిచింది. దీంతో అధికారులు వాటిని కొనుగోలు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రబీలో 3,53,774 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు...

ఈ ఏడాది రబీ సీజన్‌లో మొత్తం అన్ని రకాల పంటలు కలుపుకుని 3,53,774 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశారు. అందులో భాగంగా జిల్లా మొత్తం 2022-23 రబీ సీజన్‌కుగానూ ఈకేవైసీ 97 శాతం నమోదైనట్లు అధికారులు లెక్కలు తేల్చారు. అదేవిధంగా 2022 ఖరీఫ్ సీజన్‌లో 4,64,999 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేపట్టారు. అంటే రైతుల ఈకేవైసీ 98 శాతం పూర్తయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. మార్చి నెల నాలుగో తేదీ వరకు ఈకేవైసీ తేదీని పొడిగించి మరీ ఈకేవైసీ నమోదు ప్రక్రియ చేపట్టారు.

నష్టపోయిన పంటల వివరాలు...

పంట	హెక్టార్లలో
వరి	214.57
మొక్కజొన్న	80.97
పత్తి	170.04
మినుములు	101.21
పెసర	40.49
పొగాకు	20.24
పొద్దు తిరుగుడు	20.77
జొన్న	141.70



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ నాగులుప్పలపాడు ఏవో, రైతులు

వేగంగా పంట నష్టం అంచనాలు



అకాలంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను వేగంగా అంచనా వేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రత్యేక ఉత్తర్వులిచ్చారు. నష్టపోయిన రైతులను పూర్తిగా గుర్తించే పనిలో నిమగ్నమయ్యాం. జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాల వారీగా అంచనాలు రూపొందిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 790 హెక్టార్లలో ఎనిమిది రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనాలు రూపొందించాం. ప్రధానంగా వరితో పాటు మినుము, పత్తి, పెసర, మొక్కజొన్న, పొగాకు, పొద్దు తిరుగుడు, జొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించాం.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీ, జిల్లా వ్యవసాయశాఖ

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచుతాం



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచుతాం. ప్రస్తుతం ఒక్కో కొనుగోలు కేంద్రంలో ప్రతిరోజూ ఒక్కో లారీ లోడుకు అనుమతించాం. రైతులు కోరిన ప్రకారం కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ నాలుగు లారీల వరకైనా అనుమతిస్తాం. తడిచిన ధాన్యం విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకు పోతాం. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఒడిదుడుకులు లేవు. రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తాం.

– పి.గ్లోరియా, డీఎం, జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్

నేడే పిల్లలకు రాగిజావ పథకం ప్రారంభం

ఒంగోలు: పిల్లల్లో పౌష్టికతను పెంచేందుకు, రక్తహీనతను తగ్గించేందుకు మధ్యాహ్న భోజనంలో రాగిజావ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికంగా ప్రారంభించేందుకు తొలుత స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. అందులో భాగంగా డీఈవో పి.రమేష్, ఎంఈవో కిషోర్‌బాబు, ఏడీ సురేఖావాణిలు బండ్లమిట్టలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం పాఠశాలలో చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. ఆహారం నాణ్యతలో ఏమాత్రం లోపం రాకుండా చూసుకోవాలని పాఠశాల హెచ్ఎంను ఆదేశించారు. అయితే వర్షం పడితే కార్యక్రమానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని భావించి కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల అనుమతితో ప్రకాశం భవనంలోని స్పందన కాన్ఫరెన్స్ హాలుకు మార్పు చేశారు. రోజు మార్చి రోజు చిక్కీలు ఆహారంలో అందిస్తుండగా ఇక నుంచి చిక్కీలు లేని మూడు రోజులు మధ్యాహ్న భోజనంలో రాగిజావ అదనంగా చిన్నారులకు లభించనుంది.



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఈవో పి.రమేష్ తదితరులు

ఇంటర్ పరీక్షలకు 2323 మంది గైర్హాజరు

ఒంగోలు: సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 2323 మంది గైర్హాజరయ్యారు. బోటనీ, గణితం, సివిక్స్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 28256 మంది జనరల్ విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 26,665 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించి 3841 మందికిగాను 3109 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షలు పూర్తి ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు.

స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అభిషిక్త్‌కిషోర్, అధికారులు

- ప్రభుత్వ కార్యాలయాల సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలి
- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై ప్రజలు అందజేసే అర్జీలను పరిష్కరించడంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను నిర్దిష్ట గడువులోపు చిత్తశుద్ధి పరిష్కరించాలన్నారు. సమస్యలు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయిలో పరిష్కారం చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళావందనం, ఉమాదేవి, చెన్నయ్య, జగదీశ్వరరావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- కురిచేడు మండలం పొట్లపాడుకు చెందిన నాగమ్మ స్పందనలో అధికారులను కలిసి తన భర్త 2019లో అనారోగ్యంతో మరణించాడని పేద కుటుంబం కావడంతో జరుగుబాటు కష్టంగా మారిందంటూ అర్జీ అందజేశారు. తనకు వితంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.
- బేస్తవారిపేట మండలం చెట్టిచెర్ల గ్రామానికి చెందిన రమేష్‌బాబు స్పందనలో అధికారులను కలిసి తనకు 49 సంవత్సరాల వయసుందని చర్మ కళాకారుడిగా జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని, తనకు చర్మ కళాకారుల పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.
- టంగుటూరు మండలానికి సంబంధించిన డ్వాక్రా సంఘాల మహిళలు స్పందనలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ రుణాలకు సంబంధించిన చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని, చెల్లించినా బ్యాంకులో జమ కాలేదంటూ తమకు వచ్చిన రుణాలను పాత బకాయిల కింద తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- కొమరోలు మండలం దొడ్డవాడ గ్రామానికి చెందిన రఘురామరెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తనకు కొండ ప్రాంతంలో భూమి ఇచ్చారని, అయితే ల్యాండ్ కన్వర్షన్ చేయడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. పరిశీలించి త్వరగా న్యాయం చేయాలని కోరారు.
- త్రిపురాంతకం మండలం రామసముద్రానికి చెందిన నరసారెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తమ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఫిర్యాదు చేశారు. సాగుకు కూడా నీళ్లు ఇప్పించాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కళలకు సంపూర్ణ సహకారం



శతావధాని డాక్టర్ బులుసు అపర్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: సంగీతానికి, సాహిత్యానికి, కళలకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఉగాది సందర్భంగా ఏర్పాటు చేసిన శతావధాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వంద మంది కవులు అడిగే ప్రశ్నలకు మహిళా శతావధాని పద్యం రూపంలో సమాధానం ఇవ్వడం మహిళాశక్తికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా శతావధాని బులుసు అపర్ణను, గురు సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్‌ను సత్కరించి అభినందించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ తాను ఉపాధ్యాయురాలిగా పనిచేసిన రోజుల్లో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించానన్నారు. పద్యం తెలుగువారి సొత్తు అని, అటువంటి పద్యానికి ఒంగోలులో పెద్ద పీట వేయడం అభినందనీయం అన్నారు. మూడు రోజులపాటు జరిగే శతావధానం సాయంత్రం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముందుగా రంగారాయుడు చెరువు ఎదురుగా ఉన్న తెలుగుతల్లి, అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో కృష్ణసాయి గ్రానైట్స్ అధినేత శిద్దా హనుమంతరావు దంపతులు, చందమామ పిల్లల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.మురళీధర్‌రెడ్డి దంపతులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. రెడ్‌క్రాస్ ఒంగోలు బ్రాంచి చైర్మన్ పి.ప్రకాష్‌బాబు, నరసం గౌరవాధ్యక్షురాలు టి.అరుణ, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, విశ్రాంత స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.బాలకృష్ణారెడ్డి, శతావధానం సమన్వయకర్తలు, కళామిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సంస్థ చైర్మన్ కుర్రా ప్రసాద్‌బాబు, వ్యాఖ్యాత భువనగిరి పురుషోత్తం, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్ గిరిజా శంకర శాండిల్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కటారి శంకర్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ కార్యదర్శి కసిబిసి నాగేశ్వరరావు, కోశాధికారి సూరే ఏడుకొండలు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, కేకే కంప్యూటర్స్ రవీంద్ర, సోమినేని సురేష్, తాతా మధుసూదనరావు పాల్గొన్నారు. మొదటి రోజు శతావధానంలో 25 సమస్యలు, 25 దత్తపదులు, 10 ఆశువులు పూరించారు. పృచ్ఛకులుగా శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, అష్టావధానులు ధూపాటి రామాచార్యులు, మానేపల్లి నాగకుమార శర్మ, ఇలపావులూరి శేష శ్రీధర్ శర్మ, గుడ్లూరి వెంకటేశ్వర్లు, గాదేపల్లి దివాకరదత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, గడియారం శంకరశర్మ, అప్రస్తుత ప్రసంగ పృచ్ఛకులుగా నెమ్మాని సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రులు



త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు ఉగాది 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. నవరాత్రుల్లో ప్రతిరోజు వాహన సేవలు నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రతిరోజు అమ్మవారికి అభిషేకాలు, కాలపూజ, గోపూజ, బాల భోగం, ఉభయదాతల ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, ఆలయ ఉత్సవం నిర్వహించనున్నారు. 31వ తేదీ బలిహరణ, వసంతోత్సవం, పూర్ణాహుతి వేదపండితులచే వైభవంగా జరగనున్నాయి.

వాహన సేవలు:

బాలాత్రిపురసుందరీదేవి వసంత నవరాత్రుల్లో ప్రతిరోజు ఒక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 22వ తేదీ ఉగాది రోజున ఉదయం పల్లకీ సేవ, రాత్రి పద్మ వాహనం, 23న హంస వాహనం, 24న తదియ వ్యాఘ్ర వాహనం, 25న శేషవాహనం, 26 న మయూర వాహనం, 27న సింహవాహనం, 28న గజవాహనం, 29వ తేదీ నందివాహన సేవలను వైభవంగా నిర్వహించనున్నారు.

1వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ఒంగోలు: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) అనుసరించి 2023-24 విద్యా సంవత్సరానికి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాల అమలుకు సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్ ఈనెల 22 నుంచి అందుబాటులో ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నాటికి 5 సంవత్సరాలు పూర్తయిన పిల్లలు ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ పాఠశాలలను ఎంచుకోవచ్చన్నారు. స్టేట్ సిలబస్ ఎంచుకోవాలనుకునే పిల్లలు 2023 జూన్ 1వ తేదీ నాటికి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ పోర్టల్ హెచ్‌టీటీపీ//సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ అనే పోర్టల్‌లో ఏప్రిల్ 10వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ప్రకారం విద్యార్థుల దరఖాస్తుల అర్హత నిర్ధారణ ఏప్రిల్ 13 నుంచి 17వతేదీ వరకు జరుగుతుందన్నారు. మొదటి విడత లాటరీ పద్ధతి జాబితా విడుదల ఈనెల 18న ఉంటుందన్నారు. పాఠశాలలో మొదటి జాబితాలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాల ధ్రువీకరణ ఏప్రిల్ 19 నుంచి 25వ తేదీలోపు పూర్తిచేయాలన్నారు. రెండో విడత లాటరీ జాబితా ఏప్రిల్ 25న ఉంటుందని, వారు పాఠశాలల్లో మే 1 నుంచి 5వ తేదీలోపు చేరాలని డీఈవో పి.రమేష్ పేర్కొన్నారు.

నేడు వేనూతల కాటమరాజుస్వామి తిరునాళ్ల

గుండంచర్ల (పెద్దారవీడు): మండలంలో గుండంచర్ల పంచాయతీ సమీపంలో నల్లమల అడవుల్లో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగా భవానీ తిరునాళ్ల మంగళవారం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. యాదవుల ఆరాధ్యదైవంగా కొలిచే కాటమరాజు, గంగాభవానీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్‌లను కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటలకు అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలు, ఉదయం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం, రాత్రి గం.10.15 కు ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం, బ్రహ్మంగారి నాటకం, మహిళలచే కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో యాదవులు బొల్లావుకు భక్తిశ్రద్ధలతో నైవేద్యం చెల్లించి అనంతరం మధ్యాహ్నం నుంచి వీధుల్లో తప్పెట్లతో ఊరేగించి కాటమరాజుస్వామి ఆలయం దగ్గరకు చేరుకుంటారు. మార్కాపురం ఆర్టీసీ అధికారులు మార్కాపురం పట్టణం గరల్స్ హైస్కూల్ నుంచి, గిద్దలూరు ఆర్టీసీ అధికారులు గిద్దలూరు, కంభం నుంచి ఉదయం నుంచే బస్సులు కాటమరాజుస్వామి ఆలయం దగ్గరకు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.



ముస్తాబైన వేనూతల కాటమరాజు ఆలయం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కోటిరెడ్డి మృతదేహం

మార్కాపురం: అప్పుల బాధను తట్టుకోలేక పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గజ్జలకొండ పంచాయతీ మాలపాటిపల్లెలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన జి.కోటిరెడ్డి (51) తనకున్న 4 ఎకరాలతో పాటు కౌలుకు 5 ఎకరాల పొలం తీసుకొని మిర్చితో పాటు వివిధ పంటలు సాగు చేశాడు. గత 3 ఏళ్లుగా తీసుకున్న అప్పులపై వడ్డీభారం ఎక్కువ కావడంతో ఈ నెల 9న పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కనుక్కొని వెంటనే ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు భార్య అనంతమ్మ తెలిపింది. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

31 నుంచి రఘునాయకస్వామి కల్యాణ మహోత్సవాలు

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని చదలవాడ గ్రామంలో వేంచేసిన రఘునాయక స్వామి 235వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 31 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అనీల్ కుమార్ తెలిపారు. 31వ తేదీ అంకురారోపణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 7వ తేదీ స్వామి కల్యాణాన్ని అత్యంగా వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అనుమతి లేని ఎరువులు సీజ్


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ నాయక్, ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం: పట్టణంలోని వివిధ దుకాణాల్లో సరైన పత్రాలు లేకుండా అమ్ముతున్న 1.90 లక్షల రూపాయల విలువ చేసే ఎరువులను సీజ్ చేసినట్లు ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పలు దుకాణాల్లో గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్, టెక్నికల్ ఏఓ బాషా, ఏఓ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించగా నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో ఎరువులు సీజ్ చేసినట్లు ఏఓ పేర్కొన్నారు.


పాలుట్లలో దేదీప్యమానంగా వెలుగుతున్న సోలార్ లైట్లు

అరణ్యంలో వెలుగు రేఖ

- నల్లమల చెంచుగూడేల్లో సోలార్ విద్యుత్ దీపాలు
- మంత్రి సురేష్ చొరవతో సీఎండీఎఫ్ నిధులతో ఏర్పాటు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గిరిపుత్రులు

యర్రగొండపాలెం: నల్లమల అభయారణ్యంలో జీవించే గిరిపుత్రుల్లో చీకటి పడుతుందంటే చాలు ఆందోళన మొదలవుతుంది. కటిక చీకటిలో ఏ జంతువు వచ్చి దాడి చేస్తుందోనని భయం.. విషపురుగులు కాటేస్తాయేమోనన్న ఆలోచన వారిని ప్రశాంతంగా నిద్ర కూడా పోనివ్వదు. అదే భయంతో ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్న గిరిపుత్రులు నేడు ప్రశాంతంగా నిద్రపోతున్నారు. రాత్రి వేళ ఏ బెరుకూ లేకుండా బయట తిరగగలుగుతున్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ చొరవతో సీఎండీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలే వారి ధైర్యానికి కారణం. నల్లమలలోని పాలుట్ల గిరిజన గూడెంలో కటిక చీకటిలో మగ్గుతున్న గిరిపుత్రుల పరిస్థితిని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు హనుమానాయక్ ద్వారా తెలుసుకున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్.. సోలార్ దీపాల ఏర్పాటుకు చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్(సీఎండీఎఫ్) నుంచి నిధులు మంజూరు చేయించారు. రాత్రివేళల్లో ఎవరి సహాయం లేకుండా వాటంతట అవే వెలిగేలా సోలార్ సెన్సార్ లైట్లను వీధుల్లో ఏర్పాటు చేశారు. ఈ వీధి దీపాలు ఆటోమేటిక్‌గా పగలు ఆరిపోతున్నాయి. త్వరలోనే పాలుట్ల పంచాయతీలోని గుట్టలచేను, బొన్నలబయలు, నెక్కంటి, ఇష్టకామేశ్వరి, నారుతడికల చెంచుగూడేలకు సోలార్ వెలుగులు విస్తరించనున్నాయి.

ధైర్యంగా బయట తిరుగుతున్నాం



రాత్రిపూట వీధి దీపాలు వెలుగుతుండటం వల్ల ధైర్యంగా బయటకు రాగలుగుతున్నాం. గతంలో చిమ్మ చీకటిగా ఉండేది. ఈ కారణంగా తాము పశువులకు మేత వేయటానికి కూడా బయటికి రావడానికి భయపడేవాళ్లం. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. పిల్లలు కూడా దీపాల కింద కూర్చుని చదువుకుంటున్నారు. లైట్ల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు, నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సేనావత్ దేవిబాయి, గృహిణి, పాలుట్ల

అన్ని గూడేల్లో వీధి దీపాలు



పాలుట్ల పంచాయతీ పరిధిలోని మరో 5 చెంచుగూడేల్లో సోలార్ సెన్సార్ వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఎవరి సహాయం లేకుండా పగలు వాటంతట అవే ఆరిపోయి చార్జింగ్ చేసుకుంటాయి. రాత్రి వేళల్లో వెలుగుతాయి. ఈ లైట్లు 100 వాట్స్ బల్బు కంటే ఎక్కువగా వెలుగునిస్తాయి. గిరిజన గూడేల్లో వెలుగులు నింపడానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సీఎండీఎఫ్ కింద రూ.4.40 లక్షలు మంజూరు చేయించారు.

– ఆర్.నాగేశ్వరరావు నాయక్, పంచాయతీ సెక్రటరీ, పాలుట్ల

2015లో టీడీపీ హయాంలో పాలుట్ల గిరిజన గూడెంలో కోట్ల రూపాయల ఖర్చుతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ కేవలం ఏడాదే పనిచేసింది. ముంబయి నుంచి టెక్నీషియన్లు వచ్చి మరమ్మతులు చేయాలని విద్యుత్ శాఖ అధికారులు చెబుతూ వచ్చారు. కొన్ని నెలల తర్వాత ఆ ప్లాంట్ మూతపడటంతో నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. యథావిధిగా గిరిజనుల జీవనంలో అంధకారం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనాభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ఈ తరుణంలోనే మంత్రి గిరిజనుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సోలార్ సెన్సార్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు.


సోలార్ విద్యుత్ వెలుగుల్లో పాలుట్ల గిరిజన గూడెం

5వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా కృపారావు


బాలినేని చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న కృపారావు

ఒంగోలు: రాష్ట్ర 5వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా కాకి కృపారావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒంగోలులో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. బాలినేనిని ఆయన నివాసంలో గజమాలతో సత్కరించారు. కృపారావు గతంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. తాజాగా నియమితులైన పదవిలో ఆయన మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నారు.

వస్త్ర పరిశ్రమలో అగ్రగామి 'రామ్‌రాజ్'

ఒంగోలు: గత 40 ఏళ్లుగా వస్త్ర పరిశ్రమలో అగ్రగామిగా ఉంటూ నాణ్యమైన, సంప్రదాయ దుస్తులను రామ్‌రాజ్ కాటన్ కంపెనీ అందిస్తోందని కంపెనీ వ్యవస్థాపక చైర్మన్ కేఆర్ నాగరాజన్ పేర్కొన్నారు. స్థానిక కర్నూలు రోడ్డులో పవర్ ఆఫీసు ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన షోరూంను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ షోరూంలో 6 నెలల వయసు నుంచి 80 ఏళ్ల వయసు వ్యక్తుల వరకు కాటన్ లెనిన్, కాటన్ రెడీమేడ్ దుస్తులు లభిస్తాయన్నారు. పంచెలు, రెడీమేడ్ పంచెలు, పంచె కట్టు పంచెలు, లోదుస్తులు, కుర్తాలు, పట్టు పంచెలు వివిధ రకాల డిజైన్లతో అందరినీ ఆకట్టుకునే విధంగా అందుబాటులో ఉంచామన్నారు. తమ సంస్థ ద్వారా 8 వేల మంది ఉద్యోగులు, 4 వేల చేనేత కార్మికుల కుటుంబాలు జీవన భృతి పొందుతున్నాయని చెప్పారు. రామ్‌రాజ్ కాటన్ దుస్తులను ఆదరిస్తున్న వినియోగదారులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కంపెనీ పీఆర్వో కేఎల్ఎన్ రావు, ఏరియా మేనేజర్ భరత్ పేర్కొన్నారు. ఏపీ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడు తడవర్తి వాసు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సెక్రటరీ బీవీ సుబ్బారావు తదితరులు షోరూంను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న ఏపీ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడు తడవర్తి వాసు

రేపే జాళ్లపాలెం తిరునాళ్ల


జాళ్లపాలెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం


వీరబ్రహ్మేంద్రస్వామి


చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన జైంట్‌వీల్

- లక్షన్నర మందికి పైగా భక్తులు వస్తారని పోలీసుల అంచనా

కొండపి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కొండపి మండలం జాళ్లపాలెం గ్రామంలో బ్రహ్మంగారి తిరునాళ్లను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరబ్రహ్మయ్య 1914వ సంవత్సరంలో ఉగాది పర్వదినాన ప్రస్తుతం గుడి ఉన్న ప్రాంతంలో జీవ సమాధి అయ్యారు. వీర బ్రహ్మయ్య పేరుమీద ఏటా ఉగాది రోజున గ్రామస్తులు తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రసిద్ధి చెందిన ఈ తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా గుంటూరు, నెల్లూరు జిల్లాలతో పాటు హైదరాబాద్, చెన్నై నుంచి సైతం భక్తులు హాజరవుతుంటారు. తిరునాళ్ల సందర్భంగా 6 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. పలువురు దాతలు చలివేంద్రాలు, అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. జాళ్లపాలేనికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం వివిధ రూట్లలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది లక్షన్నర మంది వరకు భక్తులు వస్తారని పోలీసులు అంచనా వేస్తున్నారు. దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు సీఐలు, ఎస్సైలు, 350 మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. భక్తులతో వచ్చే ట్రాక్టర్లకు ట్రక్కు సైడు డోర్లు తీయవద్దని సీఐ ఎం.శ్రీనివాసరావు సూచించారు. తిరునాళ్లకు వచ్చే వారు పోలీసులకు సహకరించి నిర్దేశించిన ప్రాంతంలోనే వాహనాలు పార్కింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోషకాహారంపై అవగాహన ముఖ్యం

- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్


పోషన్ పక్వాడ కిట్లు అందజేస్తున్న జేసీ అభిషిక్త్‌కిషోర్

ఒంగోలు అర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకారం ఎంతో అవసరమని, ఆ దిశగా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అన్నారు. పోషన్ పక్వాడా పేరుతో చేపడుతున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమం కరపత్రాన్ని సోమవారం స్పందన భవనంలో జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఆరేళ్ల లోపు చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పోషకహార లోపం తగ్గించేలా ఆహారంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. బలమైన ఆహారం, ముఖ్యంగా చిరుధాన్యాలు వినియోగించేలా చూడాలన్నారు. చిరుధాన్యాల ఉపయోగాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. ఐసీడీఎస్, సచివాలయాలు, సెర్ప్, మెప్మా, విద్యాశాఖ ఇతర సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమం తప్పకుండా బిడ్డలకు టీకాలు వేయించిన తల్లులను జాయింట్ కలెక్టర్ ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 79 ఫిర్యాదులు


స్పందన ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: స్పందన ఫిర్యాదులకు చట్ట పరిధిలో పరిష్కరిస్తామని ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 79 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమక్షంలోనే సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు జారీచేశారు. సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు మొదలైన ఫిర్యాదులు ఉన్నాయి. తాను 2019లో బజాజ్ కంపెనీ, ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేసి రూ.2,12,746 చెల్లించాలని, ఇంకా రూ.1,66,990 చెల్లించాలని వేధిస్తున్నారని ఒంగోలుకు చెందిన రమణయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భార్యను కూడా అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒంగోలు జైకిసాన్ అగ్రికల్చరల్ వెల్ఫేర్ సొసైటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పేరుతో తన వద్ద రూ.25 వేలు తీసుకున్నారని, 9 నెలలు పనిచేయించుకొని రెండు నెలల జీతం ఇచ్చి తిప్పుకుంటున్నారని గుంటూరుకు చెందిన రోజ రాజా అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థగా ప్రచారం చేసుకుంటూ చాలా మంది వద్ద డబ్బులు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుని తన డబ్బులను ఇప్పించాలని ఆయన కోరారు. వెంటనే సంబంధిత ఫిర్యాదులను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని, తద్వారా వేగవంతంగా బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంపై జర్మన్ల ఆసక్తి

- పేర్నమిట్టలో ప్రకృతి సేద్యం పరిశీలన


జర్మన్‌లకు ప్రకృతి వ్యవసాయంపై వివరిస్తున్న డీపీఎం సుభాషిణి


అటవీ చైతన్య ద్రావణం తయారీని పరిశీలిస్తున్న జర్మన్‌లు

చీమకుర్తి: జిల్లాలో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయంపై జర్మన్‌లు ప్రత్యేక ఆసక్తిని ప్రదర్శించారు. జర్మనీకి చెందిన జీఐజెడ్ టీమ్ సభ్యులు ముగ్గురు, మధ్యప్రదేశ్, ఒడిశాకు చెందిన ఒక్కొక్కరు కలిసి స్థానిక ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో సోమవారం సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో డాక్టర్ విజయ రాఘవరావు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సేద్యం పద్ధతులను స్వయంగా పరిశీలించారు. పేర్నమిట్టలోని రాఘవరావుకు చెందిన 5.8 ఎకరాల్లో మామిడి, జామ, అంతర పంటలుగా మిర్చి, టమోటా, శనగ, ఉల్లి, పుచ్చ వంటి పలు రకాల పంటల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించారు. బీజామృతం, ఘన జీవామృతం, అటవీ చైతన్య ద్రవం వంటి పలు రకాల జీవామృతాలతో పంటలను సాగు చేస్తున్నారు. వాటిని జర్మన్ బృందంలోని సభ్యులైన ఉటే రెక్మన్, లీసా నిస్‌ఎన్స్, దొరోతి బామ్‌తో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, ఏపీకి చెందిన మరో ముగ్గురు సభ్యులు ఆశీర్వాద్ దాస్, మృదుల్ భార్గవ్, రాజీవ్ ఆహూజా స్వయంగా పరిశీలించి వాటి ఉత్పత్తుల వివరాలు, దిగుబడులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి ప్రకృతి సాగు పద్ధతులను వివరించారు.

వ్యవసాయ శాస్త్రవేత్త 'సర్వేపల్లి'కి డాక్టరేట్

- తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతులమీదుగా ప్రదానం


తెలంగాణ గవర్నర్ తమిళసై నుంచి అవార్డు అందుకుంటున్న సర్వేపల్లి విజయ్‌కుమార్

చీమకుర్తి: మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన సర్వేపల్లి విజయ్‌కుమార్ తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. విజయ్‌కుమార్ సోదరుడు రవిరాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రై అగ్రి ల్యాండ్(క్రిడా–కేంద్రియ మెట్ట పంటల పరిశోధనా కేంద్రం)లో సర్వేపల్లి సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. వాటర్ షెడ్‌లో వనరుల పరిరక్షణకు సంబంధించిన అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఈనెల 18న హైదరాబాద్‌లో గవర్నర్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారని వివరించారు. కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

తండ్రి హత్యకేసులో కుమారుడికి జీవిత ఖైదు

మార్టూరు: వ్యసనాలకు లోనై అడిగినంత డబ్బు ఇవ్వలేదనే కారణంతో కన్న తండ్రిని హత్య చేసిన కుమారుడికి కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధించింది. సోమవారం మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. బొబ్బేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల పరశురామారావు (71) పోలీసుశాఖలో ఏఎస్ఐగా పనిచేసి రిటైరై ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. వారిలో చివరి వాడైన బత్తుల సురేష్‌బాబు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరుగుతూ తండ్రికి వచ్చే పెన్షన్ డబ్బు వాడుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో 2020 జూన్ 13న ఉదయం 6.30 గంటలకు సురేష్‌బాబు తనకు రూ.30 వేలు నగదు కావాలని అడుగగా అందుకు తండ్రి నిరాకరించాడు. ఆగ్రహించిన సురేష్‌బాబు అందుబాటులో ఉన్న జామాయిల్ కర్రతో తండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దాడిలో పరశురామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి ఇంకొల్లు సీఐ ఆర్ రాంబాబు ఆదేశాలతో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు సురేష్‌బాబును అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేశారు. ఒంగోలు ఏడో అదనపు అదనపు జ్యూడిషియల్ కోర్టులో రెండేళ్లకు పైగా వాదప్రతివాదనలు పూర్తయ్యాక న్యాయమూర్తి డీ అమ్మనరాజు సాక్ష్యాధారాలను పరిశీలించి ముద్దాయి సురేష్‌బాబును దోషిగా నిర్ణయించి సోమవారం అతనికి జీవిత ఖైదుతో పాటు రూ 2 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.